పోటీ పరీక్షల మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఐఐటి, జెఇఇ, ఎపిఇఎపి, నీట్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గద్దె శ్రీనివాస్, దుగ్గిరాల సత్యం చేతుల మీదుగా విద్యార్థులకు బుధవారం అందించారు.కళాశాల డెవలప్‌మెంట్ ఛైర్మన్ గద్దె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందించిన ఈ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు ఈ కళాశాలలో చేరి ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పెన్మెట్ల ఛత్రపతిశివాజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కుబడి పాలన

- ఎన్నికల హామీలు బుట్టదాఖలు
- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- కార్మికులపై పనిగంటల భారం
- మహిళలపై దాడులకు స్పందన కరువు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదైంది. ఏడాదికి ముందు ఎన్నికల సమయంలో జిల్లాలో కూటమి అధినాయకులు కలియ తిరిగారు. ప్రజలకు హామీల వర్షం గుప్పించారు. సూపర్ సిక్స్‌కు కూడా ఈ జిల్లాలోనే అంకురార్పణ జరిగింది. అనంతరం ఎన్నికల్లో భారీ విజయంతో కూటమి నాయకులు అధికారాన్ని చేజిక్కించుకున్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ఎన్నికల్లో గెలిచిన కూటమి నాయకులు... ఇప్పుడు ఆ వైఫల్యాలనే కొనసాగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకొచ్చిన తర్వాత పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఉచిత ఇసుక పాలసీ జిల్లాలో మేడిపండు చందంగా మారింది. ఆ పార్టీ నేతల ఇసుక దందా తెరమీదకొచ్చింది. వాటాల కోసం పడిన పంచాయతీలు అధినేత వరకూ వెళ్లడంతో జిల్లాలో ముఖ్యనేతల అసలు రంగు సైతం బయటపడింది. కేంద్ర ప్రభుత్వ మెప్పుకోసం కార్మికుల పని గంటలను పెంచుతూ ఇటీవల చేసిన కేబినెట్ నిర్ణయం కార్మిక వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఇలా అనేక వైఫల్యాలు మధ్య కూటమి ఏడాది పాలన ముగిసింది.

రైతుల ఆశలు ఆవిరి...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సాగుకు సాయం అందుతుందని జిల్లా రైతులంతా భావించారు. సర్కారు వచ్చిన తర్వాత మూడు పంటలు వేసినా పైసా కూడా ప్రభుత్వం విదల్చకపోవడంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. కూటమి సర్కారు పగ్గాలు చేపట్టిన తరువాత గతేడాది జులైలో వర్షాలు, వరదలు పంటలను ముంచెత్తాయి. చాలా పంటలు నారుమళ్లు దశలోనే పాడయ్యాయి. దీంతో రైతులు రెండోసారి నారుమళ్లను వేశారు. అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు పూర్తిగా వర్షాలు, వరదలపాలయ్యాయి. ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే 30 వేల ఎకరాలకు పైగా పంటలు నీళ్ల పాలయ్యాయి. వారికి నష్టపరిహారం అందిస్తామని సిఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. కాని పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. పలుమార్లు రైతులు ఆందోళనలు చేసినా స్పందించలేదు. అన్నదాత సుఖీభవ పథకం ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతుంది. దీని కోసం జిల్లాలో 1.33 లక్షల మంది రైతులు ఎదురు చూస్తున్నారు.

గతేడాది జులై 18న కురిసిన వర్షానికి నీట మునిగిన పంటను చూపుతున్న రైతు(ఫైల్)

నిడదవోలు, కొవ్వూరు పట్టణాలకు గోదావరి నీరందిస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. జిల్లా వ్యాప్తంగా గోదావరి నదీకోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్‌ల నిర్మాణం పూర్తి చేయలేదు.

అవినీతి అక్రమాల్లో గత పాలకులతో పోటీ

గత ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకులు అనుసరించిన తీరునే నేటి పాలకులూ అనుసరించి అవినీతి, అక్రమాల్లో పోటీ పడుతున్నారు. జిల్లాలో ఏజెన్సీ ముఖద్వారం మొదలుకొని ధవళేశ్వరం బ్యారేజీ చివరకు సముద్ర సంగమం వరకూ గోదావరి నదిలో ఇసుక యథేచ్ఛగా దోపిడీకి గురవుతోంది. జిల్లాలోని 20 అధికార ర్యాంపుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయి. వెరసి గడిచిన ఏడాదిలో సుమారు రూ.100 కోట్లకుపైగా ఇసుక దందా జరిగినట్లు తెలుస్తోంది. గత ఏడాది ఎన్నికల అనంతరం జిల్లాలోని స్టాక్ పాయింట్లలో 2.44 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక జిల్లాలో స్టాకు ఉండగా వారం రోజుల్లోనూ ఊడ్చేసిన ఘనతను కూటమి నేతలు మూటగట్టుకున్నారు. చివరకు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సైతం ఇసుక లేకుండా చేశారు. ఆపై ఉచిత ఇసుక విదానం ప్రకటించిన ప్రభుత్వం పలు మార్లు నాలుక కరుచుకుంది. చివరకు ఉచితం పేరుతో టన్నుకు రూ.265తో పాటు రవాణా ఛార్జీలు జోడించింది. వెరసి గత ప్రభుత్వ ధరతో పోల్చితే లారీకి రూ.5 వేలు, ట్రాక్టకు రూ.3 వేలు చొప్పున అదనపు ధర చెల్లించాల్సిన దుస్థితి తలెత్తింది.

పడకేసిన పారిశ్రామిక ప్రగతి

. 'బాబు వస్తే జాబొస్తుంది' 'పారిశ్రామిక ప్రగతి పరుగులు' పెట్టిస్తామంటూ పాలకులు చెప్పిన కొటేషన్లు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి.గడిచిన ఏడాదిలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా జిల్లాలో ఏర్పాటు కాలేదు. జిల్లాలో అతిపెద్ద పరిశ్రమల్లో ఒకటైన ఆంధ్ర పేపర్ మిల్ సంస్థలో కార్మికులు పోరాట బాట పట్టిన విషయం విధితమే. ఈ పోరాటాలపై ప్రభుత్వం కనీసం స్పందించిన దాఖలాలు లేవు. తాజాగా పని గంటలను 10 గంటలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విమర్శలకు దారితీసింది. తాజాగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రభుత్వం ప్రకటించింది. హడావుడిగా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ వారంలోనే ప్రారంభోత్సవ దిశగా అడుగులు పడుతున్నాయి. అయితే యువ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం కల్పిస్తామంటూ చేస్తున్న ఈ ప్రయత్నం ఏ మేరకు సత్ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి మరి.

మహిళలపై అఘాయిత్యాలు

జిల్లాలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రభుత్వ స్పందన పూర్తిగా కరువైంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆస్పత్రిలో ఫార్మా విద్యార్థి నాగాంజలి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే ఆస్పత్రిలో ఓ ఉద్యోగి వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై విద్యార్థి, మహిళా సంఘాలతో పాటు ప్రతిపక్షపార్టీలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేశాయి. నిందితులను శిక్షించాల్సిన ప్రభుత్వం ఈ ఘటనపై కనీసం స్పందించలేదు. మంత్రులు కనీసం పరామర్శించిన దాఖలాలు లేవు. చివరికి నాగాంజలి మృతిచెందిన సమయంలో కనీసం ముఖం కూడా చూడనీయకుండా పోలీసు బలగాల మధ్య మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలించేశారు. ఈ ఘటనను మహిళా హోం మంత్రి కనీసం ఖండించకపోవడం విమర్శలకు తావిచ్చింది. పాస్టర్ ప్రవీన్ పగడాల విషయంలోనూ ప్రభుత్వ తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మరణాన్ని ధ్రువీకరించడంలోనూ, పోస్టుమార్టం రిపోర్టును బయటపెట్టడంలోనూ పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభకు అనుమతులు ఇవ్వకపోవడం కూడా విమర్శలకు దారితీసింది.

బొల్లినేని ఆసుపత్రిలో ఆత్మహత్యా యత్నం చేసుకున్న ఫార్మా విద్యార్థిని నాగాంజలిని పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు(ఫైల్)

ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసు

నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం...

సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే తమ లక్ష్యమని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గోదావరి పుష్కరాలు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం 2వ డివిజన్ వెంకట్రామయ్య నగర్‌లో బుధవారం జరిగింది. ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌సి సోము వీర్రాజు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, నగర కమిషనర్ కేతన్ గార్గ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసేపు టిటి, షూటింగ్, క్యారమ్స్, చెస్ ఆడి అలరించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడారు, రాజమహేంద్రవరం నగర చరిత్రలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఓ మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ఈసారి క్రీడలను కూడా అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో దీన్ని నిర్మించామన్నారు. రూ. 1.91 కోట్ల మున్సిపల్ సాధారణ నిధులు, రూ.1.50 కోట్ల శాప్ నిధులు కలిపి మొత్తం రూ.3.41 కోట్లతో దీన్ని నిర్మించామన్నారు. ఇక్కడ క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, షూటింగ్, స్నూకర్ వంటి గేమ్స్‌తో పాటూ జిమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ద్వారా నగరపాలక సంస్థకు ఏటా రూ.10లక్షల ఆదాయం సమకూరనుందన్నారు. ఏడాది కాలంలో రాజమహేంద్రవరంలో సుమారు రూ. 150 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ ఏడాది మరో రూ.100 కోట్ల పనులు చేపట్టబోతున్నట్లు చెప్పారు. ఖేలో ఇండియా ద్వారా లారీ స్టాండ్‌లో రూ.50 కోట్లతో మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందన్నారు. ఎంఎల్‌సి సోము వీర్రాజు మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక దఢత్వం పెరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా క్రీడాసంస్కృతిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడూతూ. గోదావరి పుష్కరాల పేరుతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి తర్వాత రాజమహేంద్రవరంలోనే రైఫిల్ షూటింగ్ ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడారంగానికి అత్యధిక ప్రాధాన్యతని స్తున్నార న్నారు. ఉద్యోగాల్లో ఉన్న క్రీడా కోటా రిజర్వేషన్‌ను 2 నుంచి 3 శాతానికి ప్రభుత్వం పెంచిందన్నారు. ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించిన వారికి రూ. 7 కోట్ల నగదు ప్రోత్సాహంతో పాటు గ్రూప్-1 ఉద్యోగావకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో రాజమహేంద్రవరంలో వాటర్ గేమ్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. నగరంలోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ దోహదపడుతుందన్నారు. ఈ ఒక్క రోజే రూ. 58.41 కోట్ల విలువైన 161 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో రాజమహేంద్రవరాన్ని టూరిజంతో పాటు ఇటు స్పోర్ట్స్ హబ్‌గా కూడా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఇఇ పి.రీటా, మాధవి, సిఎంఎం రామలక్ష్మి, ఇతర అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సన్నబియ్యంతో మిడ్డే మీల్స్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించిన రోజు నుంచే విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజన పథకం'లో సన్న బియ్యాన్ని వినియోగించనున్నట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, హాజరును మెరుగుపరిచే దిశగా మరొక స్ఫూర్తిదాయకమైన చర్య తీసుకుందన్నారు. అందులో భాగంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకానికి సన్నబియ్యాన్ని సరఫరా చేసిందన్నారు. కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణలో ఫైన్ రైస్ సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించారన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా నాణ్యమైన ఫైన్ రైస్‌ను నిల్వ చేయడం, పంపిణీ చేయడం వంటి చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు సమన్వయంతో పని చేయాలని కోరారు.

రైతులకు సన్మానం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో అన్నవరప్పాడు జెడి ఫౌండేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ముక్కామల, ముత్యాలవారి పాలెం, ఉమ్మిడివారిపాలెం, ఓదురివారిపాలెం గ్రామ రైతులను ఫౌండేషన్ సభ్యులు పి.వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.మూర్తి, రేలంగి రాజేష్, బి.సూర్యప్రకాష్, పి.కృపాకర్రావు, పి.శివ, రైతులు తదితరులుపాల్గొన్నారు.

ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - పెరవలి

ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి, కానూరు పిహెచ్‌సిల్లో రూ.9.83లక్షలతో నిర్మించిన ఆరు పడకల యూనిట్‌లను, ఎమర్జెన్సీ కోవిడ్ రెస్పాన్స్ పాయింట్, ఖండవల్లి గ్రామంలో రూ.68.50లక్షలతో నిర్మించిన రోడ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రతి గ్రామానికీ ప్రాథమిక ఆరోగ్య సదుపాయం అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రోగులకు మరిన్ని వైద్య పరీక్షలకు ఉపయోగపడే ల్యాబ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పిహెచ్‌సిలను అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. పిహెచ్‌సిల్లో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా పనిచేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ముందుచూపుతో పిహెచ్‌సిల్లో ఎమర్జెన్సీ కోవిడ్ రెస్పాన్స్ పాయింట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం కోవిడ్‌కు భయపడాల్సిన అవసరం లేదన్నారు. గత ఐదేళ్లుగా ఖండవల్లిలో రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక దాదాపు రూ.31 కోట్లతో రోడ్లను వేశామన్నారు. లింకు రోడ్లను సిసి రోడ్లుగా మార్చామన్నారు. టిడ్కో, ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాల అంశాలపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గోదావరి నీరును నిడదవోలుకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, కలెక్టర్ పి.ప్రశాంతి, సర్పంచ్‌లు పులిదిండి నాగరాజు, భావన మధుపూర్ణచంద్, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, జనసేన, టిడిపి మండల అధ్యక్షులు అతికాల శ్రీను, పిప్పర రవికుమార్, తహశీల్దార్ డి.అచ్యుతకుమారి, ఎంపిడిఒ పద్మిని, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నన్నయలో నిర్మాణాలను పరిశీలించిన శాప్ ఛైర్మెన్

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఖేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు బుధవారం పరిశీలించారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్‌తో కలిసి ఆయన యూనివర్సిటీ ప్రాగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్, యూనివర్సిటీ ఇంజినీర్లను పనులపై ఆరా తీశారు. అనంతరం యూనివర్సిటీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విసి ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ జి.సుధాకర్ యూనివర్సిటీ ఇంజినీర్లు, అధికారులు, కాంట్రాక్టర్‌తో సమీక్షించారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణాలు పూర్తయ్యేందుకు రూ.6.10 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.3.16 కోట్లు అవసరం అవుతుందని చెప్పారు. ఆరు నెలల్లోనే నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద స్విమ్మింగ్ పూల్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్మాణంలో ఉందన్నారు. నిర్మాణం పూర్తి చేసి జాతీయ స్థాయి పోటీలు నిర్వహించాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. విసి ప్రసన్నశ్రీ నాయకత్వంలో నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. విసి ప్రసన్నశ్రీ మాట్లాడుతూ శాఫ్ సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు క్రీడాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లే అవుట్ పనుల్లో నాణ్యత తప్పనిసరి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం హౌసింగ్ లే అవుట్‌లలో నిర్వహించిన పనులపై హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్‌రెడ్డితో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గృహ నిర్మాణాల లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా పనులు పూర్తి చేసిన తర్వాత క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, వాటి వివరాలు తెలియజేయాలన్నారు. ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా నివేదిక అందించాలన్నారు. జిల్లాలో 326 హౌసింగ్ లే అవుట్లలో చేపట్టిన 29 పనులపై మాత్రమే నాణ్యత ప్రమాణాల నివేదిక అందించారన్నారు. ఇంకా 297 పనులకు సంబంధించి నివేదిక రావాల్సి ఉందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని వారి విషయంలో ఉపేక్షించేది లేదని స్పష్టం చేవారు.

పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం పిహెచ్‌సిలో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 లక్షలతో ల్యాబుల సౌకర్యాన్ని కల్పిస్తూ నూతన భవనాన్ని నిర్మించామన్నారు. దీని ద్వారా మరిన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి వస్తాయన్నారు. యంత్రాలు, సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో మౌలిక వసతులు కల్పించే విధానంలో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెండే వెంకటరావు, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండల ప్రెసిడెంట్ బాలాజీ, తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎఒగా మంగతాయారు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఎంపిడిఒ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కెఎం.మంగతాయారు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె జీలుగుమిల్లి ఎంపిడిఒ కార్యాలయంలో పనిచేస్తూ సాదరణ బదిలీలో భాగంగా బదిలీపై గోపాలపురం వచ్చారు. కార్యాలయం సిబ్బంది ఎఒకు అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తానని ఆమె తెలిపారు.

కార్టూ'నిజం'



అందరూ దొరలే... ఇసుక దొంగలెవరో?

నిబంధనలకు విరుద్ధంగా రవాణా

ప్రజాశక్తి- కడియం

కడియం మండలంలోని వేమగిరి-కడియపులంక(2022-1) మాన్యువల్ ఉచిత ఇసుక రీచ్ అవకతవకలకు అడ్డాగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉచిత ఇసుక పాలసీకి ఇక్కడ తూట్లు పడుతున్నాయి. అధిక ధరలు వసూలు చేస్తూ, వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు కొందరు కూటమి నేతలు. అసలు వినియోగదారుల ప్రమేయం లేకుండానే ఎటువంటి ఆధారాలు, పత్రాలు లేకుండానే యథేచ్ఛగా ఉచిత ఇసుక రవాణా సాగిపోతోంది.

తూర్పుగోదావరి జిల్లాలో ఓపెన్ ఇసుక రీచ్‌లు, సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు, పట్టాభూముల్లో ఇసుక తవ్వకాలను పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నిబంధనల మేరకు ఈనెల 1 నుంచి అక్టోబర్ 15 వరకు నిలుపుదల చేస్తున్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు పత్రికా ప్రకటన ద్వారా గత కొన్నిరోజులు క్రితం ప్రకటించారు. ఈ జాబితాలో వేమగిరి- కడియపులంక ఇసుక రీచ్ కూడా వుంది. కానీ కడియం మండలంలోని వేమగిరి-కడియపులంక (2022-1) మాన్యువల్ ఉచిత ఇసుక రీచ్ నేటికీ యథాతదంగానే కొనసాగుతుంది. ట్రాక్టర్ ఇసుకను రూ.600 అమ్ముతూ, ఎగుమతి జట్టు కూలీలకు రూ.300 ఇస్తున్నారు. ఈ ఇసుక రీచ్ లో సుమారు 10 నుంచి 15 జట్లు పనిచేస్తున్నాయి. ఒక్కో జట్టులో 10 నుండి 14 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక రవాణా జరుగుతుంది. సుమారు రూ.1200 నుంచి రూ.1500 వరకు రోజు కూలీ గిట్టుబాటు అవుతుందని కొందరు కార్మికులు తెలియజేస్తున్నారు. అలాగే గత కొన్ని నెలల క్రితం ఒక రోజుకి సుమారు 550 నుండి 650 వరకు ట్రాక్టర్‌ల ఇసుక రవాణా జరిగేదని, ప్రస్తుతం సుమారు 350 నుండి 450 ట్రాక్టర్‌ల ఇసుక రవాణా జరుగుతుందని జట్టు మేస్త్రీలు తెలియజేస్తున్నారు. కూటమి, స్థానిక నాయకుల అనుచరులే ఇక్కడ గుమస్తాలుగా చెలామణి అవుతున్నారు. నేతల మనుషులు పరిసర ప్రాంతాల్లో కలియ తిరుగుతూ బయట వ్యక్తుల రాకపోకలు గమనిస్తూ ఎప్పటికప్పుడు సమాచారం వారి నేతకు అందిస్తున్నారు. 11 రోజులుగా ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికి యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబందిత రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు చోద్యం చూడడం గమనార్హం.. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉచిత ఇసుక దోపిడీని అరికడతారో.. అక్రమార్కుల ఇచ్చే ముడుపులకు, రాజకీయ నేతల సిపార్సులకు తలొ గ్గుతారో వేచి చూడాలి. దీనిపై కడియం తహశీల్దార్‌ను వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ అందుబాటులోకి రాలేదు. సంబంధిత ఉచిత ఇసుక రీచ్ ప్రాంతానికి సంబంధించిన విఆర్ఒలను అడుగగ్ విషయం తమకు తెలియదని బదులిచ్చారు.

ఇసుకను లోడ్ చేయించుకుంటున్న ట్రాక్టర్

రైతుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - గోపాలపురం

రైతుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. బుధవారం జగన్నాథపురంలో ఏరువాక కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు, ఎఒ రాజారావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. నియోజకవర్గంలో నల్లజర్ల-1, గోపాలపురం-1 మండలాలకు 80శాతం సబ్సిడీతో రసాయనిక మందులను పిచికారీ చేసే డ్రోన్లను రైతులకు అందజేశారు. మన జీవనంలో వ్యవసాయం అంతర్భాగమని, రైతు మాత్రమే ప్రకృతికి దగ్గరగా ఉంటూ, మెరుగైన జీవన ప్రమాణానికి దగ్గరగా ఉంటున్నారన్నారు. నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ రూ.3 కోట్ల వరకూ అందించామన్నారు. పంటలకు గిట్టుబాటు ధరను అందిస్తూ, గత ప్రభుత్వ హయాంలో 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, 49 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 24 గంటల్లో రైతులకు నగదును అందించినట్లు తెలిపారు. ఏరువాకలో భాగంగా ఎడ్ల బండిపై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కూర్చొని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గల్లంతైన రెండో యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానాం బీచ్ లో స్నానం చేసేందుకు సముద్రంలో దిగి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. ఈ సంఘటన లో గల్లంతైన రెండో యువకుడు అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన ఇసుకపల్లి జశ్వంత్(19) మృతదేహాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎస్.యానాం అంబాజీపేట మండలం మాచవరం కు చెందిన యాళ్ల హరి కిషోర్(19), అయినవిల్లి మండలం నేదునూరు కి చెందిన ఇసుకపల్లి జశ్వంత్(19) తో మరో ముగ్గురు నేదునూరుకు చెందిన యువకులు ఎస్.యానం బీచ్కు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు యువకుల్లో గల్లంతయిన ఇరువురు అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యువకుడు యాళ్ల హరి కిషోర్ మృతదేహం మంగళవారం రాత్రి లభ్యమైన విషయం విదితమే. జశ్వంత్ మృతదేహాన్ని తహశీల్దార్ వివిఎస్.దివాకర్ సమక్షంలో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రి తరలించి కేసు దర్యాప్తు జరుపుకుంటున్నట్లు ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు.

పత్రాలు లేని 48 ద్విచక్ర వాహనాలు సీజ్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సరైన పత్రాలు లేని 48 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మూలపేట పరిసర ప్రాంతాల్లో పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి ఎస్ఐలు, సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 48 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, 20 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులను గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీస్స్టేషన్కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొత్త వ్యక్తులు ఇంటి అద్దెకి వస్తే వారి పూర్తి వివరాలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు ఏవైనా చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తుని

16వ జాతీయ రహదారిలోని కొండవారిపేట సమీపంలోని పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సిఐ ఎం.గీతారామకృష్ణ సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 40 సంవత్సరాల ఉంటుందని అంచనా వచ్చారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతిని శరీరంపై రక్తపు గాయాలు ఏమీ లేవని అన్నారు. రోడ్డు ప్రమాదమా, లేక ప్రమాదవశాత్తు మరణించాడా అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆ వ్యక్తిని ఎవరైనా గుర్తు పడితే 9440796572 నెంబర్కు తెలియచేయాలని సూచించారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

గ్రామాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పైడిమెట్ట గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డిఒ రాణిసుస్మితతో కలిసి బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రహదారులు, ప్రభుత్వ భవనాలను అభివృద్ధి చేసి ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునే ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరిస్తున్న ఆర్డిఒ సేవలను ఎంఎల్ఎ అభినందించారు. సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి తహశీల్దార్ మోహనభారతి, ఆర్.రామకృష్ణ, డిఇ శ్రీనివాస్, ఎఇ త్రిమూర్తులు, గ్రామ కార్యదర్శి నందిరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పలు పథకాలను అమలు చేస్తుందని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఖరీఫ్ సీజన్లో సాగునీటిని అందించేందుకు మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం నుంచి నీటిని ఎంఎల్ఎ ముప్పిడి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ ఆయకట్టు రైతులు నీటి తీరువా సకాలంలో చెల్లించి ఎత్తిపోతల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షులు ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, ఎత్తిపోతల నిర్వహణ కమిటీ సభ్యులు కాకర్ల సత్యేంద్ర, గన్నిన సత్తిబాబు, ఎపి ఎస్ ఐడిసి డిఇ గురవయ్య, ఎఇ సుధీర్, తహశీల్దార్ మోహనభారతి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటెన్సిఫైడ్ కేస్ ఫైండింగ్ క్యాంప్ డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. క్షయపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే కళ్లె పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 60 మందికి కళ్లె పరీక్షలు నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో ఎస్టిఎస్ ఆర్.పోతురాజు, టిబి హెల్త్ విజిటర్ సమీర్, రాంబాబు ఎంఎల్హెచ్పి ఫాతిమా, ఎఎన్ఎం దుర్గ, సచివాలయ సిబ్బంది, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎఇగా సుధాకర్

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్గా పివి.సుధాకర్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎఇగా పనిచేసిన కృష్ణజీవప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ముమ్మిడివరం ఎఇగా పనిచేస్తున్న సుధాకర్ బదిలీపై వచ్చారు.

నేడు పాఠశాలల పునఃప్రారంభం

శివకోడు హైస్కూల్లో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లు

ప్రజాశక్తి - రాజోలు

నిన్నటితో వేసవి సెలవులు ముగిశాయి. గురువారం పాఠశాలలు పున్ణప్రారంభించే సమయం ఆసన్నమైంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఏటా పెరుగుతున్న ఫీజులు, పుస్తకాల ధరలు చూసి మధ్యతరగతి ప్రజలు భయపడుతున్నారు. బ్యాగు,యూనిఫాం, టై, బెల్టు, షూస్ వంటి వస్తువుల ధరలు కూడా ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో చదివించాలని మధ్య తరగతి కుటుంబాల్లో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లాలో ప్రభుత్వ, మండల/జడ్పి, మున్సిపల్ ,ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో 1,272 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 228 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల పరిధిలో 92 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అలాగే 451 ప్రయివేటు పాఠశాలు న్నాయి. ఈ పాఠశాలల పరిధిలో 80 వేల మంది ఉన్నారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 8,110 మంది ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు.

జూన్ నెలంటే భయం..!

అనేక మధ్య తరగతి కుటుంబాల వారికి జూన్ నెల వచ్చిందంటే ఎక్కడ లేని భయం పట్టుకుంటుంది. ఈ నెలలో ఖర్చులు తడిసి మోపెడవుతుంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయ కుటుంబాలే. ఓ పక్క వ్యవసాయ సాగు ప్రారంభం. మరో పక్క పాఠశాలలు పున్ణప్రారంభం. అప్పో సప్పో చేసి తమ బిడ్డలను మంచి ప్రయివేటు పాఠశాలల్లో చదివించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. కాగా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభవేళ వ్యవసాయ పనులకు, తమ పిల్లల స్కూలు ఫీజులు, పుస్తకాలు తదితర వస్తువులకు డబ్బులు చూసుకోవాలని తల్లిదండ్రుల్లో ఆలోచన మొదలైంది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు పాఠశాలలు నిర్వహిస్తున్నాయి. పాఠశాల తెరిచాక సంవత్సరం ఫీజును మూడు, నాలుగు వాయిదాల్లో చెల్లించాలి. అనాదిగా దాదాపు ప్రతి మండలంలో సేవాదక్పథంతో నిర్వహిస్తున్న రెండు, మూడు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలైతే తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులను బట్టి కొన్ని మినహాయింపులు ఇస్తున్నారు.

పిల్లల చదువులతో సామాన్యులకు ఆర్థిక భారం

ప్రయివేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకూ సుమారు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకూ ఉన్నాయి. పుస్తకాలకు సుమారు రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకూ ఉన్నాయి. అదే కార్పొరేట్ స్కూళ్లలో అయితే సుమారు రూ.28 వేలు నుంచి రూ.39 వేలు వరకూ వసూలు చేస్తున్నారు. ఇక మార్కెట్లో స్టేషనరీ, రెడీమేడ్ దుస్తులు, క్లాత్ షాపులు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు కావలసిన వస్తువుల షాపులు, షూమార్టులు ఆయా కొనుగోళ్లతో సందడి నెలకొంది. నోట్బుక్స్ ధర రూ.20 నుంచి రూ.25 కాగా, బ్యాగులు రూ.200 నుంచి రూ.500 వరకు, షూస్ రూ.300 నుంచి రూ.600 వరకూ, రెండు జతల స్కూల్ డ్రస్లతో పాటు ఒక వైట్ డ్రస్, ఒక టీషర్టు సుమారు రూ.4వేలు వరకూ ఉంటున్నాయి. ఆటో లేదా ఇతర స్కూల్ బస్ చార్జీలు నెలకు రూ.600 నుంచి రూ.1,000 వంటి వాటితో ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు సుమారు రూ.18 వేలు నుంచి రూ.28 వేలు వరకూ, కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులకు సుమారు రూ.40 వేలు నుంచి రూ.50 వేల వరకూ ఖర్చు అవడంతో తల్లిదండ్రులకు చుక్కలు కనబడుతున్నాయి.

స్కూల్ రెడీనెస్ ప్రోగ్రంతో ప్రారంభం

గతేడాది మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా ప్రభుత్వం స్కూల్ రెడీనెస్ కార్యక్రమాన్ని అమలు చేసింది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పాఠశాలలు ప్రారంభం రోజు నుంచే తరగతులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముందే రాష్ట్రవిద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలను శుభ్రం చేయడం, తాగునీరు, మధ్యాహ్న భోజనానికి అవసరమైన విధంగా కిచెన్ షెడ్లు రెడీ చేయడం, చిన్నపాటి మరమ్మతులు చేయించడం, రికార్డు షీట్లు తయారు చేయడం,అడ్మిషన్లు చేపట్టడం తదితర పనులను స్కూల్ రెడీ నెస్ ప్రోగ్రామ్ లో చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

శివకోడు అసంపూర్తిగా నిలిచిన హైస్కూల్ భవనం

స్టూడెంట్ కిట్లు సిద్ధం

పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ పాఠ్య, రాత పుస్తకాలు, బెల్టు, డిక్షనరీలను స్టూడెంట్ కిట్గా అందించనున్నారు. ఈ కిట్లో సామగ్రిని విద్యార్థులకు అంద జేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాలకు మండల స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ మండల స్టాక్ పాయింట్కు చేరుకున్న స్టూడెంట్ కిట్ వస్తువులను పాఠశాలలకు తరలించాలని ఉన్నతాధికారులు ఆదే శాలు జారీ చేశారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన 1,581 పాఠశాలల్లో చదువుతున్న 91,12 వేల మంది విద్యార్థు లకు వీటిని అందించనున్నారు. ఇప్పటి వరకూ స్టూడెంట్ కిట్లో భాగంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, బ్యాగ్స్, డిక్షన రీలు చేరుకున్నాయి. ఇంకా యూనిఫామ్, షూస్, సాక్సులు రావాల్సి ఉంది.

13న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - రామచంద్రాపురం

పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని బుధవారం మంత్రి సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంయుక్త ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధికారి డి.హరిశేషు తెలియ చేశారు. ఈ సందర్భంగా హరిశేషు మాట్లాడుతూ పరిసర ప్రాంత చుట్టుపక్కల నిరుద్యోగ యువతీ యువకులు, పరిశ్రమలు, సేవా రంగాల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని, 11 కంపెనీలకు సంబంధించిన సుమారు 400 ఉద్యోగాలు భర్తీ చేయడానికి ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. టెన్త్,ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా, పాలిటెక్నిక్ చదివిన యువతి, యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ సమస్యల నిర్మూలించేందుకు, యువతకు ఉపాధి కల్పించాలనే ఉన్నత ఆశయంతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం, సందేహాలను నివత్తి చేసుకునేందుకు రఘువర్మ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ం91 99484 04165, రాజేంద్ర ప్రసాద్ ప్లేస్మెంట్ ఆఫీసర్ 9704414258 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పలుచోట్ల ఏరువాక పౌర్ణమి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో బుధవారం పలుచోట్ల జరిగిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాతయింజరంలో ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

ఐ.పోలవరం: ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని పాతఇంజరం గ్రామ పంచాయితీ పరిధిలో రాచకొండ మాణిక్యాలరావు పొలంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, మండల వ్యవసాయ అధికారి ఎం.వాణి,రైతుల సమక్షంలో స్థానిక ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు బుధవారం తొలకరి దిక్కును ప్రారంభించారు.అనంతరం మురమళ్ళ మినీ గోకులం నిర్మాణాన్ని ప్రారంభించారు. మారుటేరు నుండి విడుదల చేయబడిన రెండు కేజీలు ఎంటియు 1443 రకం గల విత్తనాల సంచులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, అశోక్,గుత్తుల సాయి,సాగి సూరిబాబు రాజు,జంపన భీమరాజు,సాగిరాజు సూరిబాబు తదితర రైతులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** సాగులో రైతన్నను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. భీమనపల్లిలో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమానికి ఎంఎల్ఎ ఆనందరావు శ్రీకారం చుట్టారు.కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ జడ్పిటిసి సభ్యుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాయకులు పెచ్చెట్టి చంద్రమౌళి, గుత్తుల నాగేశ్వరరావు,పెయ్యల తిరుమలరావు, ఆకుల వెంకటరెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** రెడ్డిపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను స్థానిక రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి బుధవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు భూసార పరీక్షలకు సంబంధించిన పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్, ఎడి షంషే, ఎఒ కడలి ప్రసాద్, మాజీ సర్పంచ్ కె.సూర్య భాస్కర్రావు, నీటి సంఘం డైరెక్టర్ కొలిశెట్టి జయప్రకాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి - అమలాపురం

యోగాంధ్ర మాస ఉత్స వాలలో భాగంగా యోగా పై అభిరుచి ఉన్నవారు యోగ పోటీలలో పాల్గొని యోగా పట్ల ఉన్న ప్రతిభను చాటుకుని జిల్లా యొక్క పేరు ప్రఖ్యాతులు దేశస్థాయిలో ఇనుమడింపజేయాలనికలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు బుధవారం స్థానిక గోదా వరి భవన్ నందు నిర్వ హించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో, షోలో యోగ పోటీలకు 10-18 మధ్య వయసు గల వారు 8 మంది పాల్గొనగా, 19- 35 మధ్య వయసుగల వారు ముగ్గురు, 35 సంవత్సరాలు పైబడిన వారు నలుగురు పాల్గొ న్నారని కలెక్టర్ తెలిపారు.

కథాకళి చిత్రం షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని శానపల్లిలంక గ్రామంలో కథాకళి సినిమా షూటింగ్ ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సినిమా ప్రారంభ క్లాప్ కొట్టి షూటింగ్ శ్రీకారం చుట్టారు.


క్లాప్ కొడుతున్న పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సినిమాల నిర్మాణం గ్రామీణ ప్రాంతాల నేపథ్యంలో జరగడం ఎంతో హర్షదాయకమన్నారు. ఇది స్థానికులకు ఆర్థికంగా, సాంస్కృతికంగా మేలు చేస్తుందన్నారు. అలాగే, స్థానిక ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశమిస్తుంది అని తెలిపారు. కార్యక్రమానికి చిత్ర యూనిట్ సభ్యులు, గ్రామ ప్రజలు, అభిమానులు హాజరై సందడి చేశారు. కథాకళి చిత్ర యూనిట్కు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పార్డ్ ఇండియా' సేవలు అనిర్వచనీయం

ప్రజాశక్తి-నల్లజర్ల

గ్రామీణ ప్రజల అభివృద్ధి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ 'పార్డ్ ఇండియా' చేస్తున్న కృషి అనిర్వచనమని ఎంపిడిఒ పిఎస్ఎస్.సింహాద్రిరావు, సిఐ వై.రాంబాబు కొనియాడారు. నల్లజర్లలో పార్డ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పార్డ్ ఇండియా సంస్థ వ్యవస్థాపకులు బేతాళ వీరాస్వామి చేస్తున్న సేవలను పార్డ్ ఇండియా గౌరవ అధ్యక్షులు కారుమంచి గణేష్ వివరించారు. s అనంతరం కుట్టు మిషన్ శిక్షణ పొందిన 30 మంది మహిళలకు సరిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, సంస్థ మండల శాఖ అధ్యక్షులు మహ్మద్ ఇలియాజ్షరీఫ్, గౌరవ అధ్యక్షులు చీమకుర్తి కృష్ణప్రసాద్, విద్యా విభాగం అధ్యక్షులు బొందల శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షులు గోతం సత్యలక్ష్మి, కోశాధికారి జివివి.ప్రసాద్, సంస్థ కార్యనిర్వాహక ప్రతినిధులు సోమిశెట్టి వెంకట్రావు, గాలంకి హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు నమోదు చేయడం దారుణం

ప్రజాశక్తి - అమలాపురం

వైసిపి రాష్ట్ర నాయకులపై సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై కూటమి ప్రభుత్వం అనేక కేసులు మోపడం చాలా దారుణమని వైసిపి ఎంఎల్సి కుడుపూడి సూర్యనారాయణ రావు అన్నారు. ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలా పాత్రికేయులపై కేసులు నమోదు చేస్తే పలు ఎలక్ట్రానిక్ ఛానల్ లో ఉదయం పూట ప్రసారమయ్యే చర్చ వేదికకు ఏ పార్టీ నాయకులు రాని పరిస్థితి నెలకొంటుందని అన్నారు.. ఏనాడు సర్దార్ కాటన్ బంకింగ్ హామ్లో కాలువలు తవ్వి నాలుగు పంటలు పండే పొలాలను నేడు కాంక్రీట్ జంగిల్ గా మార్చాలని చూస్తున్నారని అన్నారు.

మాట్లాడుతున్న మండపేట మున్సిపల్ చైర్పర్సన్ నూక దుర్గారాణి

కూటమి ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు పెరిగాయి

ప్రజాశక్తి - మండపేట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగాయని మండపేట పురపాలక సంఘ చైర్ పర్సన్ పతి వాడ నూక దుర్గా రాణి ఆరోపించారు. దీనికి నిరసనగా బుధవారం అమలాపురంలో జిల్లా వైసిపి పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీ లో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడ మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. దీనిపై వైసిపి తరఫున నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్,వైస్సార్సీపీ నాయకులు యరమాటి వెంకన్నబాబు ,ఎర్రగుంట అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం: ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి - మండపేట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని మండపేట పురపాలక సంఘ చైర్పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి చేసిన ఆరోపణల అవాస్తవమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. బుధవారం ఎంఎల్ఎ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుతంలో మహిళలపై జరిగిన దాడుల యొక్క వివరాలు, ఇప్పటి వివరాలు తీసుకువస్తే మీరు చేసిన ఆరోపణలపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచ్ పెదబాబు

సన్నవిల్లిలో ముమ్మరంగా ఉపాధి పనులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

సన్నవిల్లి పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 200 మంది ఉపాధి కూలీలు పంట కాలువలు పంట బోదెలు చెరువులు, మురుగు కాలువల పూడికతీత వంటి పనులు చేస్తున్నారు. బుధవారం కూలీలు చేస్తున్న ఉపాధి పనులను సర్పంచ్ చిక్కం పెదబాబు పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మస్తర్లను తనిఖీ చేసిన సర్పంచ్ పెదబాబు, ఉపాధి ఫీల్డ్అసిస్టెంట్ కాశి శ్రీరామ్కు పలు సూచనలు ఇచ్చారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్కు కాకినాడకు చెందిన శ్రీ కృష్ణ నవదీర్ శర్మ బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ కృష్ణ నవదీర్ శర్మ ప్రతీ ఏటా ఏప్రిల్ 22న పుట్టినరోజు పురస్కరించుకుని 75 మంది యాత్రికులకు అన్నప్రసాద వితరణ చేసేందుకు రూ. 50 వేలు విరాళం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు పర్య వేక్షకులు సత్యమూర్తి స్వామి వారి చిత్రపటం అందజేశారు.


దాతకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న పర్యవేక్షకులు

పట్టణంలో రైతు బజారు ప్రారంభం

పట్టణంలో రైతు బజార్ ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో రూ 80 లక్షలతో నిర్మించిన రైతు బజార్ ను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు నేరుగా రైతు బజార్లో అమ్ముకునేందుకు వీలుగా పురపాలక సంఘం రూ.80 లక్షలతో 25 షాపులు నిర్మించారని, రైతే రాజు అనే నిదానంతో తమ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తుంది అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.4500 కోట్ల నిధులు కేటాయించామన్నారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్లో రూ.8, 856 కోట్లు కేటాయించి రైతుల పక్షపాతిగా నిలిచామని, నియోజకవర్గాన్ని ఏడాదిలో రూ. 125 కోట్లుతో అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి4 ద్వారా 40 కుటుంబాలను దత్తత తీసుకొని నిరుపేదలకు అండగా ఉంటానని హమీఇచ్చారు. హృదయ సంబంధ వ్యాధితో బాధపడుతున్న వారికి తక్షణం వైద్య సేవలు అందేలా 3 ప్రత్యేక బస్సులు త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ డి.అఖిల, డిఎస్ఒ ఉదయభాస్కర్, జిల్లా మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి, మున్సిపల్ చైర్పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, డిఇ మార్కెటింగ్, మున్సిపల్ డిఇ శ్రీకాంత్, టిపిఒ వాసంశెట్టి శేషగిరి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ వాసుదేవరావు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటూ క్రీడలకు ప్రాధాన్యత

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి, జీవితంలో స్థిరపడాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణం లోని శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా మైదానంలో జరిగిన బాస్కెట్ బాల్ సమ్మర్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఆల్ ఇండియా బాస్కెట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ గన్నమనేని చక్రవర్తి మాట్లాడుతూ గత ఏప్రిల్ 6న ఈ సమ్మర్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామని 2 నెలలపాటు 120 మంది విద్యార్థులకు బాస్కెట్బాల్ శిక్షణ అందించమన్నారు. త్వరలో రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం మంత్రి సుభాష్ క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉండవల్లి గోపాల్రావు వెటర్నరీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయలక్ష్మి, పీడీ ఎం. అప్పన్న పాల్గొన్నారు.

పశు వైద్యశాల భవనం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని టేకి గ్రామంలో నాబార్డ్, ఆర్ఐడిఎఫ్ నిధులు రూ 6.50 లక్షలతో నిర్మించిన గ్రామీణ పశు వైద్యశాల నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ వేగుళ్ల మాట్లాడుతూ నియోజకవర్గంలో 2 కోట్ల30 లక్షలతో కాంట్రాక్టర్లు లేకుండానే నీటి సంఘాల ద్వారా పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రారంభోత్సవానికి ముందే పశు వైద్యశాల నూతన భవనం పలుచోట్ల బీటలు వారడంగమనార్హం. దీనిపై పలువురు రైతులు, గ్రామస్తులు, విమర్శిస్తున్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఆలమూరు ఎడి అనిత, డిఇ టి.వెంకటేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి వివి రమణమూర్తి, గ్రామ టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాస్, టిడిపి సీనియర్ నాయకులు పుచ్చల శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, గుడాల జయబాబు, బలవరెడ్డిసత్తిబాబు తదితరులు, పాల్గొన్నారు.

మొక్కుబడిగా ట్రీ కటింగ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యుత్ శాఖ సిబ్బంది మొక్కుబడిగా ట్రీ కట్టింగ్ చేస్తూ చేతులు దులుపుకోవడం పై చెయ్యేరు గన్నేపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని చెయ్యరు గున్నేపల్లి పంచాయతీ పరిధిలో బుధవారం మిషన్ ద్వారా 33 కెవి వైర్ల పై వాలిన చెట్ల తొలగింపు(ట్రీ కట్టింగ్) కార్యక్రమం చేపట్టారు. మొక్కుబడిగా చెట్లను తొలగించి పని ముగించుకుని వెళ్ళిపోవడం పై స్థానికులు ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తున్నారు. తరచూ 33 కెవి వైర్లపై చెట్లు కొమ్మలు పడటంవల్ల మంటలు చెలరేగి అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాఠశాలలకు పుస్తకాల సరఫరా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ఆయా పాఠశాలకు సరఫరా చేశామని అర్బన్ రేంజ్ డిఇ బి.దిలీప్కుమార్ తెలిపారు. గురువారం నుంచి విద్యార్థులకు అందిస్తారన్నారు. అర్బన్ పరిధిలో మొత్తం 67,734 పుస్తకాలు రాగా 65,400 పుస్తకాలను ఆయా పాఠశాలలకు చేర్చామని డిఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంఇఒ-2 రమారజని, సిఆర్ఎంటిలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, ఇందిర, కుమారి కోటేశ్వరి, నాగలక్ష్మి, పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

కిట్లను పంపిణీ చేస్తున్న అర్బన్ డిఇ దిలీప్కుమార్

CHANGE OF NAME

I, **KALYANAM YASWANTH,** S/o. Kalyanam Gangadhara Rama Rao, D.No. 3-19, Jamathota Street, Near Venkateswara Temple, Kapavaram, Korukonda, E.G. Distrct, A.P., Pin: 533289, I have changed my name from **KALYANAM Y.P.V.V.N.SESHU** (Old Name) to **KALYANAM YASWANTH** (New Name). Hence forth Iam being called **KALYANAM YASWANTH,** S/o. Gangadhara Rama Rao, for all purpose.

ప్రకటన

తాతపూడి రాణి, W/o. టి.కృపావరం, డోర్ నెం. 3-113, మాదాపురం, ఇసుకపల్లి పోస్ట్కు సంబంధించిన కొత్తపల్లి మండలం, పొన్నాడ గ్రామంలో సర్వే నెంబర్ 161/4 లో 0.50 సెంట్లు జిరాయితీ, పల్లం భూమికి సంబంధించి **డాక్యుమెంట్ నెం. 1370071987** నెంబర్ గల పత్రాలు పడిపోవడంతో నఖాల్లు ద్వారా రైతు నేస్తం లోన్ కొరకు మా బ్యాంకును సంప్రదించారు. ఈ డాక్యుమెంట్పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోగా సంబంధిత వ్యక్తులు మా బ్రాంచ్ని సంప్రదించగలరు.

అడ్రస్:
ది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్
కాకినాడ, బ్రాంచ్: యు.కొత్తపల్లి

In the Court of the Principal Civil Judge (Junior Division), Kovvur
E.P. No. 64/2024
O.S. No. 196/2021

Between:
భవ్య గ్రాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొవ్వూరు, రిప్రజెంటెడ్ బై its ప్రెసిడెంట్, Palempati V.S.Swaroop ...*DHR/ Plaintiff*
మరియు
శ్రీ నిమ్మల ధన బాలాజీ ...*JDR/Defendant*

To:
JDR/ Defendant:
శ్రీ నిమ్మల ధన బాలాజీ, S/o. సుబ్బారావు, వయస్సు 59, వ్యాపారం, C/o. పోతుల రత్నకుమారి, HP గ్యాస్ కంపెనీ వీధి, కొవ్వూరు, కొవ్వూరు JCJC.

పై నెంబరు గ్రంథములో E.P. No. 64/2024 in O.S. No. 196/2021 లో E.P సంగతులు తెలియజేయు నిమిత్తం JDR/ Defendant కు శ్రీ కోర్టు వారి ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపినప్పటికీ JDR/ Defendant బుద్ధి పూర్వకముగా Avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా E.P. No. 64/2024 in O.S. No. 196/2021 లో JDR/ Defendant కు EP సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు EP లో మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల ది. 20-6-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవచ్చును. లేని యెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా: 20-6-2025

ఆత్కూరి సత్యనారాయణ
DHR/ Plaintiff తరపు అడ్వకేట్
కొవ్వూరు, తూ॥గో॥జిల్లా
సెల్: 9849847197
కొవ్వూరు
ది.08-6-2025